# వెంటాడిన "ఆత్మ" కథ

రవి మొదటి భార్య చనిపోయింది. ఆమె పేరు లక్ష్మి. రేండేళ్ళ తర్వాత మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. ఆ అమ్మాయి పేరు కళ. ఆమె ఎయిర్ హోస్టెస్‌గా పనిచేస్తూ ఉండేది. కళ నాకు తెలుసు. ఒకరోజు నాతో తన భర్త ఈమధ్య అదోలా ప్రవర్తిస్తున్నాడనీ, వీలయినంతవరకు తనకుదూరంగా ఉండడానికి ప్రయత్నిస్తున్నాడనీ బాధపడుతూచెప్పింది.

తర్వాత కొద్ది రోజులకే రవి మాయింటికి వచ్చాడు. 'మీతో కొన్ని విషయాలు చెప్పాలి. మీరు తేలిగ్గా నవ్వేస్తారని నాకు తెలుసు. అయినా ఎవరికో చెప్పుకోవాలి. మీరు నాబాధ అర్థం చేసుకోగలరని చెబుతున్నాను" అన్నాడు.

''ఇంత ఉపోద్ఘాతం ఎందుకండీ. అసలు విషయం చెప్పండి'' అన్నాను కాఫీ కప్పు అందించి.

కాఫి సిప్ చేస్తూ తీవ్రంగా గోడకేసి చూస్తున్నాడు. అక్కడ ఏముందా అని నేనూ చూశాను. బల్లి పురుగును పట్టుకునే ప్రయత్నంలో ఉంది. కాని అతను చూస్తున్నది ఆ బల్లిని కూడా కాదనీ, అక్కడ వున్న ఏ వస్తువునూ కాదనీ అతని చూపులవల్ల అర్థం చేసుకున్నాను.

"నేను కళను ముట్టుకుంటే చాలు నా మొదటి భార్య లక్ష్మి నా పక్కన వచ్చి నిల్చుంటుంది.

"అబ్సర్డ్!"

"వినండి. ప్లీజ్! మధ్య మాట్లాడకండి. నాకు అలా అనిపిస్తుంది. ఆమె ఉనికిని నేను ఫీల్ అవుతాను. ఏదో ఛాయలో ఆమె ఆకారం నాకు కన్పించినట్టే అవుతుంది. ఆదోలా నవ్వుతూ నిల్చున్నట్టుగా ఉంటుంది. కళ మీద ఉన్న నా చేతిమీద, తన చేతిని పెట్టినట్టు అవుతుంది. నేను ఒక్కసారిగా చెయ్యి లాక్కుంటాను. రాత్రిళ్ళు మంచం మీద మా ఇద్దరి మధ్యలో అమె వచ్చి పడుకున్నట్టు ఉంటుంది. నేను లేస్తాను. ఆమె కూడా లేస్తుంది. నేను ఆరామ్ కుర్చీలో కూర్చుంటాను. ఆమె వెళ్ళిపోతుంది. ఆమె వస్తున్నప్పుడు నీళ్లలో ఏదో మునుగుతున్న చప్పుడు నాకు వినిపిస్తుంది. ఆ తర్వాత నీటికి సంబంధించి తమాషా వాసన అనుభవిస్తాను. ఆమెతోపాటు ఆ వాసనకూడా వెళ్లిపోతుంది." ఓ క్షణం ఆగి అతని ముఖంలోకి చూశాను.

సిగరెట్ తాగుతూ సుడులు తిరుగుతున్న పొగను చూస్తూ మళ్లీ ప్రారంభించాడు.

లక్ష్మిని చిన్నతనం నుంచీ నేను ఎరుగుదును. చాలా అందంగా ఉంటుంది. కాని పెద్దగా చదవలేదు. సాంప్రదాయంగల కుటుంబంలో పెరిగింది. నేను అమెరికాలో చదివి వచ్చాను. మాధురి మా ఇంటికి వస్తూ పోతూ వుండేది. నేను ఆమెను పలకరిస్తే సిగ్గుపడుతూ పారిపోయేది. ఆమె మీద నాకు ఎలాంటి అభిప్రాయం లేదు.

నేను చేసుకోబోయే పిల్ల గురించి నా ఆలోచనలు వేరు. సొసైటీలో కలసిపోవాలి. నాతో పాటు క్లబ్బుల్లో డాన్సు చెయ్యగలగాలి. పార్టీల్లో డ్రింకు తీసుకోవడానికి వెనుకాడకూడదు.

ఒకరోజు అమ్మ నా పెళ్లి ప్రస్తావన తెచ్చింది. లక్ష్మిని చేసుకో

మన్నది. నేను తృళ్లిపడ్డాను. నేను చేసుకోనన్నాను. అమ్మకు నామీద కోపం వచ్చింది. మాట్లాడటం మానేసింది. ఇంట్లో అమ్మతో పాటు చెల్లాయిలూ తమ్ముళ్లు కూడా మాట్లాడటం మానేశారు. నాకు వళ్లుమండి ఇంటికి రావడం మానేశాను. క్లబ్బులోనె మకాం పెట్టాను.

ఒకరోజు నాకోసం మనిషి పరుగెత్తుకొచ్చాడు. మా అమ్మకు పక్షవాతం వచ్చిందని చెప్పాడు. నేను వెళ్లేనరికి అమ్మ పరిస్థితి చాలా ఘోరంగా వున్నది. కాలు వంకరపోయింది. మాట పడిపోయింది. కాలూ చెయ్యి కదపలేదు. మంచం పక్కనే లక్ష్మి కూర్చొని వున్నది. ఆ అమ్మాయిని చూసీ చూడనట్టే ఉండిపోయాను. అమ్మకు మంచి డాక్టర్ చేతనే మందులు ఇప్పిస్తున్నాను. అమ్మకు సేవలు రాత్రింబవళ్లు లక్ష్మి చేస్తున్నది.

"నాకు అది ఇష్టంలేదు. నర్సును పెడతానన్నాను. అమ్మ వద్దని సైగ చేసింది.

ఒకరోజు లక్ష్మి తల్లి వచ్చింది. "అబ్బాయ్! ఇలా పరాయి పిల్ల నీఇంట్లో ఎంతకాలం చేస్తుంది చెప్పు? నలుగురూ నాలుగు విధాలుగా అనుకుంటున్నారు. మా అమ్మాయిని తీసుకెళ్లడానికి వచ్చాను." అన్నది.

నాకభ్యంతరం లేదన్నాను.

లక్ష్మి వెళ్లిపోయింది. వెళ్తూ వెళ్తూ నావైపు చూసిన ఆమెచూపును ఈనాటికీ మర్చిపోలేను. మా చెల్లెళ్లు చిన్నవాళ్లు. నర్సును పెట్టాను. లక్ష్మిని పంపిచగానే అమ్మకు జబ్బు మళ్ళీ ఎక్కువైంది.

చివరకు లక్ష్మిని చేసుకున్నాను.

లక్ష్మి ఆదర్శ గృహిణి.

నా భార్యగా నేను ఆమె నుంచి ఇంకా చాలా ఆశించాను. ఒకరోజు బలవంతంగా క్లబ్బుకు తీసుకెళ్ళాను. అందరూ డాన్సు చేస్తున్నారు. తనను కూడా రమ్మన్నాను. ఏడుపు ముఖం పెట్టింది. ఒకగ్లాస్ బీరు తాగమన్నాను. తాగనన్నది. నాకు కోపం వచ్చింది.

ఆ కంపెనీలో నేను నిస్సహాయుడిగా కూర్చుండిపోయాను. ఇంతలో ఒక స్నేహితుని భార్య నన్ను డాన్సుకు ఆహ్వానించింది. నేను వెళ్ళాను. చాలా సేపు, బాగా అలసిపోయేంత వరకు డాన్సు చేసాను.

తిరిగి టేబుల్ దగ్గరకు వచ్చాను. నా స్నేహితుడు మాత్రమే ఉన్నాడు.

"లక్ష్మి ఏది?''

"తెలియ. .దు'' బాగా తాగిన మైకంలో సమాధానం ఇచ్చాడు.

నేను క్లబ్బులో అందర్నీ అడిగాను. ఇంటికి వచ్చాను. ఇంటికి కూడా రాలేదు. వాళ్ళ అమ్మగారింటికి వెళ్లి వాకబు చేశాను. అక్కడ కూడ లేదు.

రెండో రోజు క్లబ్బు స్విమ్మింగ్ పూల్‌లో లక్ష్మి శవం తేలింది.

ఆ తర్వాత చాలా బాధపడ్డాను.

రెండేళ్ళ తర్వాత కళను చేసుకున్నాను.

అమ్మను నర్సింగ్ హెూంలో చేర్పించాను.

చెల్లెళ్ళను, తమ్ముళ్ళనూ హాస్టల్స్‌లో చేర్పించాను.

నేను కోరుకున్న గుణాలన్నీ కళలో వున్నాయ్.

కాని లక్ష్మి నన్ను వదలడం లేదు. ఆమె ఆత్మ నా చుట్టూ తిరుగుతూ నన్ను భయపెడుతున్నది" అంటూ తల పట్టుకొని కూర్చున్నాడు. కొన్ని క్షణాలుమౌనం.

"మీరు ఆత్మల్ని నమ్మతారా?" అడిగాడు కొంచెం ఆగి తలెత్తి

"నమ్మను'' అన్నాను

"మరి దీన్ని ఏమంటారు"

''అది మీ గిల్టీకాన్షస్‌నెస్. మీకు భయం పట్టుకుంది.

''కాదు, కాదు, లక్ష్మి రూపాన్ని నేను స్పష్టంగా చూస్తున్నాను.''

''అదంతా మీ భ్రమ. మానసిక వైద్య నిపుణుని సంప్రదించండి" అన్నాను.

అతనికి కోపం వచ్చింది. మీ సలహాకు ఓ నమస్కారం. కళతో అనకండి. నేను పిచ్చివాణ్ణి కాదు. నాకేం పిచ్చి లేదు. వస్తాను' అంటూ వెళ్ళిపోయాడు.

ఆరు నెలల తర్వాత రవి అదే స్విమ్మింగ్ పూల్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసింది.